శ్రీమతి
డి. మంగళాంబ

పెద్దక్కయ్యా వాళ్ళూ వస్తారన్న సంబరంతో ఎదురుచూస్తున్న పద్మకీ, శేషుకీ కాలం కశ్చెం లేని గుర్రమే అయింది.

ఆశ్వయుజ మాసపు చలిగాలికి ముడుచుకుపోయి, ముసుగు బిగదీసి పడుకున్న లక్ష్మమ్మకి తెల్లవారకుండానే ఇరు వైపులనుంచీ ఇద్దరూ సుప్రభాతం పాడటం మొదలుపెట్టారు.

"లే, అమ్మా! తెల్లవారిపోయింది" అన్నాడు శేషు.

"అమ్మోయ్! ఎంత ఆలస్యమయిందో! లేవవే!" అన్నది పద్మ.

పక్కను పట్టెమంచం మీద పాల నురుగు లాంటి దోమతెరలోనూ, నిద్ర పొరలవంటి దుప్పటి మడతల్లోనూ ఒదిగి పవళించిన రాజేంద్రభోగికి పీసం అసౌకర్యం అయినట్టయింది కాబోలు– "ఏమిటది!" అని చీదరించుకున్నాడు.

పిల్లలు ఇద్దరూ కుక్కిన పేలల్లే నోరెత్తకుండా ఊరుకున్నారు. నాన్నకి కోపం వస్తే చాలా ఇబ్బందులు ఉన్నాయని వాళ్ళకి తెలుసు.

"ఇంకా తెల్లవారలేదు. నోరు మూసుకుని పడుకోండి!" అని ముదల ఇచ్చాడు ఆయన. ఈ సారి కూతుళ్ళు రాక ఆయనకి సంతోషంగా లేదు.

నిశ్శబ్దం యథాపూర్వం తాండవం చేసింది.

ఒక నిమిషం గడిచేటప్పటికి గంట గాని, రెండు గంటలు గాని గడిచి ఉంటాయి అనిపించింది శేషుకి. 'ఆలస్యం అయిందంటే తెల్లవారిపోతుంది. తెల్లవారిపోతే ఎండ ఎక్కి పోతుంది. ఎండ ఎక్కిపోతే రైలు వచ్చేస్తుంది. అందులో పెద్దక్కయ్య వస్తుంది. కాబట్టి వెంటనే లేవాలి!' అనిపించింది పద్మకి.

"అమ్మా!" అని పిలిచింది పద్మ మెల్లగా, వినీ వినబడనట్టుగా.

"అమ్మా!" అని మెల్లగా వినబడే టట్టుగానే పిలిచాడు శేషు.

"ఊఁ! పడుకోండి!" అని మత్తుగా నిద్రలోనే గొణిగింది లక్ష్మమ్మ.

"ఇక వాళ్ళు నిన్ను నిద్ర పోనివ్వరు. లేచిపో!" అని యజమాని హుకుం జారీ చేసి పక్కకి తిరిగి పడుకున్నాడు. ఏం తగాదాలు వస్తాయోనని కుమార్తెల రాక గురించి భయపడుతున్నా డాయన.

"మరి అఘాయిత్యం!. . . ఏం పిల్లలో!" అని చిరునవ్వుతో లేచి లక్ష్మమ్మ మంగళసూత్రాలు కళ్ళ కద్దుకుని, వేడినీళ్ళు కాచడానికి దొడ్లోకి వెళ్ళింది. పిల్లలు ఇద్దరూ ఆమె వెంటే వెళ్ళారు.

స్నానాలు చేసి చలవ బట్టలు వేసుకుని, కాఫీ టిఫిన్లు సేవించి స్టేషనుకు వెళ్ళడానికి ఎద్దులబండి దగ్గర సిద్ధం అయారు పద్మా, శేషూ. నాన్న అక్కడ నిలబడి పాలేరుతో ఏదో మాటలాడుతున్నాడు.

"బండి దగ్గరికి వెళ్ళి వస్తాం, నాన్నా!" అంది పద్మ.

సీతాపతి పద్మని ఒకసారి చూసి, శేషుని ఉద్దేశించి, "తుంటరి వెధవ పనులు చెయ్యక, బుద్ధిగా తిరిగి రండి!" అని ఇంట్లోకి వెళ్ళిపోయాడు.



తను ఒక్క ఉదుటున లాఘవంగా బండి మీదికి దూకాడు. పద్మకూడా బండి ఎక్కింది.

• • •

పెద్దక్కయ్యా వాళ్ళతో కలిసి కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ ఇంటికి తిరిగి వచ్చేసరికి, సుజాత అక్కయ్యా వాళ్ళు అప్పుడే వచ్చేశారు. తారకం బావ వడవ దగ్గర కూర్చుని చుట్ట కాల్చుకుంటున్నాడు.

పెద్దక్కయ్యా, పెద్ద బావ ఇంట్లోకి వెళ్ళారు.

"ఏం, తారకం బావా! ఎప్పుడొచ్చా వేమిటి?" ఆనందంతో ముఖం చేటంత చేసుకుని పలకరించింది పద్మ.

చుట్టముక్క చేతిలోకి తీసుకుంటూ, "ఇప్పుడే వచ్చానే, మరదలుగానా, నిన్ను ఎత్తుకుని పోవడానికి" అన్నాడు కొంటెగా, పద్మ వంక చూసి నవ్వుతూ తారకం.

"ఛీ, పో! ఎప్పుడూ పాడు మాటలు!" అని విసురుగా ఇంట్లోకి వెళ్ళింది పద్మ.

తను వెయ్యి వట్టుకుని వాళ్ళే ఎత్తుకుంటూ, "ఏమోయ్, పెదికూనా! ఒళ్ళంతా దుమ్మేమిటే?" అని అడిగాడు తారకం. ఇంతలో జ్వరుడ ఏదో చప్పుడు అయేసరికి తల ఎత్తి చూసి, "ఏమిటిదీ! సుగిగారి ఇంట్లోకే వచ్చేస్తున్నట్టుందే!" అన్నాడు ఆశ్చర్యంగా. తనని ఆ ఆశ్చర్యంలో కిందికి దింపేశాడు.

ఇంటి ముందు జీపు ఆగింది. ఆ చప్పుడుకి ఇంట్లో వాళ్ళంతా బయటికి వచ్చారు. జీపులోంచి సుగుణ, భాస్కరం దిగారు. వాళ్ళని చూసేటప్పటికి సుభద్ర మొహం వెలవెల పోయింది. "బాగున్నారా" అని లేని నవ్వుని తెచ్చుకుని పలకరించింది.

సుగుణ వచ్చేసింది. "మీరూ ఇప్పుడే వచ్చినట్టుందే!... అరే, సుజాతక్క కూడా వచ్చేసిందే!" అంది సుగుణ.

సుగుణ భర్త జీపు డ్రైవరుతో ఏదో మాట్లాడి వాడిని పంపించి వేశాడు. చప్పుడు కంటే దుమ్ము ఎక్కువ లేపుకుంటూ జీపు వెళ్ళిపోయింది.

"సుగుణ పనే బాగుంది. వాహన విహారమే గాని, నేలమీద కాలు మోపేటట్టు లేదు!" అంది సుజాత నవ్వుతూ.

"వారు ఆఫీసుకి ఫోను చేసి జీపు తెప్పించారు. హాయిగా ఉంటుందని దానిలో వచ్చేశాం. ఈ కాలం రైళ్ళలో, బస్సులో ప్రయాణం ఎట్టువంటి ప్రయాణం కన్నా అధమం. ఒళ్ళంతా హూనం అయిపోతుంది." ఇంట్లోకి వెళుతూ అంది సుగుణ.

పరిమేఘాల మేలిముసుగు వేసుకున్న ముఖంతో—"అంతేకదూ మరి!" అంది సుజాత.

"గేటు మాదిరే అలాగే కనబడతాయితే, అన్నీ!" అంది సుగుణ లోగొంతుకలో.

సుగుణ వాళ్ళకి నడవ పక్కన ఉన్న గది ఇచ్చారు. సుభద్ర హాల్లో పందిరి మంచాన్ని ఆక్రమించుకుంది. ఆమె భర్త కాంతారావు మంచం పక్కకి కుర్చీ లాక్కుని, పేపరులోని అంశాలు తీవ్రంగా చదివేయటం మొదలుపెట్టాడు. సుజాత వంట ఇంటి గుమ్మం దగ్గర కూర్చుని, తల్లితో ఏవో కబుర్లు చెబుతోంది. తారకం నడవ ముందే తిష్ఠ వేసుకుని కూర్చున్నాడు. దూరంగా కట్టేసిన ఎద్దులు మేత మేస్తుంటే పరీక్షిస్తున్నాడు.

అంచెలంచెలుగా ఉదయాన రైలుకి ఒకరూ, మధ్యాహ్నం బస్సుకి ఒకరూ, సాయంత్రం మరొకరూ వస్తారని ఊహించుకుని, అందరినీ ఆహ్వానించటానికి పథకాలు తయారు చేసుకున్న పద్మ, శేషులకి అందరూ ఒకేసారిగా ఇలా వచ్చేయడం కాస్తంత అసంతృప్తిని ఇచ్చినా, మరెంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. శేషు ఇల్లంతా తిరుగుతూ 'శ్రీధర్ నా అంత ఉన్నాడా?', 'భాను ఎన్నో క్లాసు?', 'ప్రభ బాగా పెరిగిందా?' అని రకరకాలైన ప్రశ్నల్ని అక్కల మీద విసురుతున్నాడు. వాళ్ళ జవాబు వినేలోగానే, మరో ప్రశ్న స్ఫురించేసరికి మరో అక్క దగ్గరికి పరుగెడుతున్నాడు. పద్మకూడా తనకు తోచిన సందేహాల్ని తీర్చుకుంటూనే ఉంది.

"పిల్లల్ని ఒక్కరూ తీసుకుని రాలేదేమిటే?" అని వంట ఇంటిలో నుంచి ప్రశ్నించింది లక్ష్మమ్మ. సుభద్ర పెదవి విరిచింది. ఆ క్షణంలోనే అక్కడికి వచ్చింది.

"పిల్లలా? మొన్ననే సుగుణ పెళ్ళికి వచ్చారు గదమ్మా! శ్రీధర్‌ని, భానుని కాన్వెంటు వాళ్ళు మాటి మాటికీ పంపరు. ఎంతో కట్టుదిట్టంగా ఉంటాయి అక్కడ చదువులు... అదీగాక, సుజాత సంగతి ఏమోగాని, నేను మాత్రం ఈ సారి నాన్నతో వ్యవహారం తేల్చుకుందామనే వచ్చాను సుమా!" అంది సుభద్ర.

"నేనూ అంతా నిశ్చయం చేసుకునే వచ్చాను! మా ఆయనకి పంటలు, కోతలు, మార్పిళ్ళు తప్ప ఇంకేమీ పట్టవు. నేనే ఆలోచించుకుని, నిర్ణయించుకోవాలి... అప్పట్టు ప్రభ ఎంత ఎదిగిపోయిందనుకున్నావమ్మా! అది సాయం చేస్తేనే గాని వాళ్ళ నాన్నమ్మకి ఇంటిపని తెమలదు. పాలేళ్ళకి అది పనులు పురమాయిస్తుంటే చూడాలి!... ఇక విద్యాధరుడికి నా దగ్గర కంటే వాళ్ళ నాన్నమ్మ దగ్గరే చనువు ఎక్కువ. 'వెళదాం రారా!' అంటే రానని ఒకటే మారాం చేశాడు" అంది.

"పండగపూటా పిల్లలు లేకుండా... ఏమిటో నా కేదో ఇదిగా ఉంది!" అంది లక్ష్మమ్మ.

"నాన్న ఉత్తరం అందిన దగ్గరినించీ నాకూ ఇదిగానే ఉంది. బలవంతాన ఆయనతో సెలవు పెట్టించి, ఏదో ఒకటి తేల్చుకుందామనే వచ్చాను!" అంది సుభద్ర.

సుజాత అందుకుంది. "మేము మాత్రం ఎలాగా రావాలనే అనుకున్నాం. ఇంతలో నాన్న ఉత్తరంకూడా వచ్చింది. ఇంకేముంది? ఈ వ్యవహారం తేలితే తప్ప ఎవ్వరికీ మర్యాదగా ఉండదనిపించింది! అందుకే..."

సుగుణ వచ్చి, "అమ్మా! బోర్నవిటా ఏమైనా ఉందా ఇంట్లో? ఉంటే కాస్త కలిపి ఇదూ!" అంది.

లక్ష్మమ్మ తత్తరపడింది. కాని, తొట్రుపాటు తెలియనీయకుండా నవ్వుతూ, "కాఫీ కలిపి ఇచ్చేదా?" అని అడిగింది.

"మా అల్లుడుగారు బోర్నవిటా తప్ప మరేదీ తాగరు" అంది సుగుణ.


"మా ఊళ్ళో అలాంటివేమీ దొరకవు, అమ్మాయ్! ఉలవపిక్కలుమాత్రం బాగా దొరుకుతాయి. కషాయం కాచి ఇస్తాం, మీ ఆయన తాగుతాడేమో కనుక్కో. ఉలవపిక్కల కషాయం ఆరోగ్యం కూడానట!" అంది సుజాత ఎగతాళిగా.

"మా ఊరు సంగతి కాదు, ఈ ఊరు సంగతి నేను అడుగుతున్నది ... ఛఛ! ఎంత పొరపాటయిపోయింది! వెంట ఒక టిన్ను తెచ్చుకోవలసింది!" అంది సుగుణ.

సుజాత మొహం మాడ్చుకుంది. లక్ష్మమ్మ ఆందోళనగా — "సాయంత్రానికి నాన్నగారికి చెప్పి నేను తెప్పిస్తాను గాని, ఇప్పటికి కాఫీ ఇచ్చేదా?" అని అడిగింది.

"వద్దులే ... సరే, భోజనాలెప్పుడు పెడతావ్?" అనడిగింది రుసరుసలాడుతూ సుగుణ.

"చిటికెలో అయిపోతుంది. మీ రలా స్నానాలు చేసి రండి—వడ్డించేస్తాను" అన్నది లక్ష్మమ్మ.



భోజనాల దగ్గర పెద్ద అల్లుడూ, చిన్న అల్లుడూ పొడి పొడిగా పలకరించుకున్నారు. ఇద్దరూ ఆఫీసులలో ఉద్యోగాలు చేస్తున్నవాళ్ళే. చిన్నల్లుడేమో పెద్ద ఆఫీసరు. పెద్దల్లుడికి చిన్న ఉద్యోగం కాకపోయినా, గుమాస్తా బాపతు. అందుచేత చిన్నవాడికి పెద్దాయనను పలకరించడం నామోషీ. పెద్దల్లుడు కదా, అతడికి చిన్నవాణ్ణి — ఎంత పెద్ద ఉద్యోగి అయినా — పలకరించడం నామర్దా.

సుజాత తల్లితోబాటు వడ్డనలకి దిగింది. తారకం అన్నపుయావ ఉన్నవాడిలాగా వడ్డించిన పదార్థాలని వద్దనకుండా ఖాళీ చేస్తున్నాడు. మిగిలిన వాళ్ళనికూడా తనతోబాటు పోటీ వెయ్యమని ఉత్సాహపరుస్తున్నాడు. తారకం రైతు. అతడికి పెద్దా, చిన్నా అని తేడాలు లేవు.

భోజనాల సందడి సద్దుమణిగాక, ఇల్లంతా నిశ్శబ్దం అయిపోయింది. ఎవరు ఆక్రమించుకున్న స్థానాలలో వాళ్ళు విశ్రమించారు. ఎంతో సరదాగా కాలక్షేపం చెయ్యవచ్చు ననుకున్న శేషుకీ, పద్మకీ నిరాశే ఎదురైంది. ఏమీ తోచక అటూ ఇటూ తిరుగాడుతున్నారు.

పట్టెమంచం కింద పడుకుని నిద్రపోతున్న సుభద్రని చూసి, "పెద్దక్క లావయినట్టుంది కదే!" అన్నాడు శేషు, లోగొంతుకలో.

"అవును! చూడు, ఎంత మంచి చీర కట్టుకుందో!" అంది పద్మ.

తర్వాత వాళ్ళకి ఇంకేం చేయాలో తోచలేదు. చిన్నక్క వాళ్ళు ఉండే గది దగ్గరికొచ్చి మెల్లిగా తలుపు తోసి చూశారు. రాలేదు. కిటికీ దగ్గర కెళ్ళి మూసిన క్రింది తలుపుల పైకి తలపెట్టి లోపలిక చూశారు. "రాణీ! నా రాణీ!" అంటూ బావ సుజాతని దగ్గరకు తీసుకుంటున్నాడు.

చటుక్కున ఇద్దరూ క్రిందికి దిగిపోయారు. అక్కడి నుంచి చడీ చప్పుడూ కాకుండా పరుగెత్తి, నడవ గోడ దగ్గరకు వచ్చి కూర్చున్నారు.


"బావ 'రాణీ' అని అక్కని పిలుస్తున్నాడేమిటి? అక్క పేరు సుజాత గదా!" అన్నాడు శేషు.

"ఛీ! పాడు!" అని మొహం చిట్లించుకుంది పద్మ.

"అదేమిటలా బావ అక్క మొహం దగ్గర ..."

"ఛీ! పాడు!" అని అసహ్యం ద్యోతకం చేసేలా ముఖం పెట్టింది పద్మ.

"ఏమిటి, సరదా! ఏమిటో కల్లబొల్లి కబుర్లు చెప్పేస్తున్నావు?"




అన్నాడు తారకం, పద్మ చెవి పట్టుకుని ఇద్దరి తలలూ పట్టుకొని ఢీకొట్టించి, "మీకేం తోస్తున్నట్టు లేదు. అవునా? ఇలా రండి. మంచి కథ ఒకటి చెపుతాను!" అని వాళ్ళిద్దర్నీ దగ్గరికి తీసుకున్నాడు.

"ఒక అడవిలో ఒక సింహం ఉంది. మూడు నక్కలు కూడా ఉన్నాయి. అవి సింహాన్ని ఎలాగైనా ఓడించాలని ..." తారకం కథ చెబుతూంటే పిల్లలిద్దరూ ఇంతింత కళ్ళు చేసుకుని వింటున్నారు.

● ● ●

ఉదయాన్నే తలంటి పోసుకుని కొత్త బట్టలు వేసుకున్నారు పద్మా, శేషూ. అప్పటికి అందరిలో కాస్త కలివిడితనం వచ్చింది. సరదాగా బాణాసంచా కాల్చారు. ఇంతలో టిఫిన్లకు వేళ అయింది.

"అందరూ రండర్రా, టిఫిన్లు పెడతాను!" అని కేక వేసింది లక్ష్మమ్మ. "పద్మా, శేషూ! మీరు ఆ బట్టలు విప్పేసుకుని మామూలు బట్టలు వేసుకోండి. సాయంత్రానికి మాసేసుకుంటారు!" అంది లక్ష్మమ్మ.

"పోనీ, ఉంచుకోనిలేవే!" అన్నాడు సీతాపతి.

"సాయంత్రానికి నల్లగా మాసేసుకుంటారు. అప్పటినించి మళ్ళీ కొత్త బట్టలు కావాలని పోరు. ఎక్కణ్ణించి తెచ్చేది?" విసుగు తోసించే స్వరంతో అంది లక్ష్మమ్మ.

"సరే, సరే! అయితే, విప్పండర్రా!" అన్నాడు సీతాపతి.

ఇద్దరూ ఊరుకున్నారు.

"ఊఁ! విప్పండి!" అని ఉరిమాడు సీతాపతి.

కొంచెంసేపు గునిసి, "నేను ఇవే ఉంచుకుంటాను!" అన్నాడు శేషు.

"నా కివే బాగున్నాయి!" అంది పద్మ.

"వెధవల్లారా! దవడ వాయగొడతాను. విప్పండి ముందు!" అని చెయ్యెత్తి గర్జించాడు సీతాపతి. ఇద్దరూ ఏడవడం మొదలుపెట్టారు.

"ఏడుపెందుకూ? విప్పండి!" అని అక్కలు కూడా వాళ్ళని కోపంగా చూశారు.

తారకం ఇంట్లోకి వచ్చాడు. జరిగినదంతా గ్రహించి, "పనివాళ్ళు! వాళ్ళకేం తెలియదు[illegible]నే చెబుతానుండండి!" అని చేతులు [illegible]కుని వాళ్ళని మండువా కోనికి తీసుకెళ్ళాడు. ఏవేవో కబుర్లు చెప్పి వాళ్ళచేత బట్టలు మార్పించాడు.

మధ్యాహ్నం భోజనా లప్పుడు తుఫాను బద్దలైంది.

"ఏమిటి నాన్నా, పిలుపునామా మార్చేశావటగా?" అని అడిగింది సుభద్ర.

సుభద్రా పతి వంచిన తల ఎత్తకుండా భోజనం చేస్తున్నాడు. చిన్నల్లుడు, తారకంమాత్రం తల ఎత్తి విచిత్రంగా చూశారు.

"మీ కందరికీ ఆ విషయమై ఉత్తరాలు రాశాను కదమ్మా!" అన్నాడు సీతాపతి.

"అయితేమాత్రం? అది మార్చవలసిన అవసరం ఏం వచ్చిందీ అని?" అని సుజాత అంది. సుజాత మాటలు విని, నోట్లో ముద్ద పెట్టుకున్న తారకం దాన్ని మింగకుండా కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా భార్యవేపు చూశాడు.

"ఏమి టిదంతా?" అన్నట్టు చూశాడు చిన్నల్లుడు.

సీతాపతి అందర్నీ పరికించి చూశాడు. చివరికి చిన్నల్లుడి వంక చూస్తూ అన్నాడు: "చూడు, భాస్కరం! నీకు తెలిసే ఉండవచ్చు. నాకు పిత్రార్జితం అయిదు ఎకరాలు ఉంది. మా కాలంలో అయిదు ఎకరాల మాగాణి అంటే తక్కువేం కాదు. నేనే వ్యవసాయం చేయించేవాడిని. అయితేనేం? రైతులాగా బతికానా? జమిందారులాగా బతికాను. మడత నలగని బట్టలు వేసుకొనిగాని పొలానికి వెళ్ళేవాడిని కాదనుకో. అది నా తత్వం. అసలు మా వంశమే అంత. మా నాన్న చెబుతుండేవాడు. చచ్చిపోయే ముందు మా తాత మా నాన్నతో — 'ఒరే, అబ్బీ! గడ్డం బాగా మాసిందిరా! మంగల్ని పిలు!' అన్నాడట. గడ్డం చేయించుకుని, స్నానంచేసి మంచం మీద పడుకున్నాక గాని ఆయన ప్రాణాలు పోలేదట. అలాంటి వారు మా పూర్వీకులు!"

భాస్కరం అన్నం కలుపుతూ, "అవునండి! నేనూ విన్నాను, మిమ్మల్ని 'సీమదొర సీతాపతి' అనడం!" అన్నాడు.

సీతపతి అందుకున్నాడు: "ఆఁ వెధవలు! ఏదో కూస్తుంటారు. వాళ్ళకి అసూయ. ఆ కాలంలో పట్నం నించి చాకలి వచ్చి మా ఇంట్లో బట్టలు తీసుకెళ్ళేవాడు. బట్టలనే ఏమిటి? తిండీ, తీర్థం, వసతి...అన్నీ మావి దర్జాయే. ఈ ఇల్లు చూడు. ఈ నాడు పాతదయింది గాని, అప్పట్లో ఇలాంటి దర్జా[illegible] ఇల్లు సిరిపురం జమిందారుగారి[illegible]క్కరికే ఉండేదట! ఎందుకు చెబుతున్నానంటే, ఇన్ని దర్జాలకు పోయి, దమ్మిడీ మిగుల్చుకోలేదూ అని చెప్పడానికి. పేరు సీతాపతి అయినా, శ్రీనాథుడిలా బతికాను!" శేషం గర్వం ఆయన కంఠంలో పొడచూపింది.


అన్నం ముగించి చెయ్యి కడుక్కుని వచ్చాడు సీతాపతి. "కానీ, నా పద్ధతి తప్పు అని తెలుసుకునే సరికి, కాలం అతిక్రమించింది. లోపం నాదే, అందుకే అనుభవిస్తున్నాను. నాకు వరుసగా ముగ్గురు ఆడపిల్లలు పుట్టారు. సుభద్రకీ, సుజాతకీ పెళ్ళిళ్ళయినంత వరకూ అన్నీ ఒక్కలాగ జరిపించాను. పెళ్ళిళ్ళు కూడా ఒక్కసారే చేశాను. సుజాతకి మేనరికం ఉంది గనుక పెద్ద చదివిన పని లేకపోయిందనుకో. సుభద్రకి ఇప్పటివాడేమోననీ, అప్పట్లో అందరూ గొప్ప సంబంధమనేదే తెచ్చారు. బాగా చదువుకుంటాడంటే, ఆమె పెళ్ళి వాయిదా వేయమంటే ఒప్పింది. కూతుళ్ళు అయినా, కొడుకులు అయినా పిల్లే అనుకున్నాను గనుక్క, నా మిగిలిన ఆస్తి అంతా పిల్లకే పంచిపెట్టేస్తున్నట్టు సుభద్ర, సుజాతల పెళ్ళి జరిగినప్పుడే సీలునామా రాయించాను. ఆస్తి వాళ్ళకి అనుభవానికి వచ్చేది నా తదనంతరమే అనుకో! అయుందా? కానీ, చిత్రం చూశావా! పెద్దవాళ్ళ పెళ్ళిళ్ళయిన ఏడాదికే వీళ్ళిద్దరూ పుట్టారు!" పద్మనీ, శేషునీ చూశాడు.

సీతాపతి ఒక్కసారి ఊపిరి పీల్చుకున్నాడు. "మనిషి అనుకున్నవన్నీ జరిగితే ఇంకేముంది? ... ఇన్నాళ్ళ తరవాత నాకు మళ్ళీ పిల్లలు పుడతా రనుకోలేదు. అందునా ఒక్కరు కాదు, ఇద్దరు! కవలలు పుట్టారు ... ఇలా నే వేసుకున్న అంచనాలు తారుమారయ్యాయి. మారిన ఈ పరిస్థితులలో మీ అక్క చెల్లెళ్ళు ఊహించే ఉంటా రనుకున్నాను. ఆ ఊహకి నే నిప్పుడు రూపం ఇస్తున్నాను. అంతే!" అన్నాడు.

"మేమేం ఊహించలేదు, నాన్నా! ఏ మాట వినబెట్టుకుంటా మనుకున్నాం!" అంది సుభద్ర. "అవునవును!" అని శ్రుతి కలిపింది సుజాత.

"మీ రలా అనుకుంటే తప్పు వారి కాదమ్మా! అయినా, మీకేం కొదవ చేశాను? మేము ఉన్నంతకాలం నా తాహతుకు తగ్గట్టుగా మీ అప్పట్నా, ముప్పట్నా చూస్తాము. ఈ మట్టం వెళ్ళిపోయాక ... సరే! ఆ సంగతులు నాకేం అవసరం లేదు!"

"అలాగంటే ఎలా, నాన్నా? అయినా, నా పెళ్ళికి నువ్వు ఖర్చు చేసిందేమీ లేదు ... వారికి అయిదువే లిచ్చావేమో! చిన్న కూతురు కదూ! దానికి పది వేలు పోసి మంచి మొగుణ్ణి తీసుకొచ్చావు ... వాని చదువుకి కూడా ఎంతో ఖర్చు పెట్టావు ... అవన్నీ అడగకూడదులే! కన్నవారికే ఇంత భేదభావం ఉంటే ..." సుభద్ర కంట తడి పెట్టింది.




"ఆఁ! నీ పని మెరుగు కాదూ! మేనరికం అని నాకు పైసా ఇవ్వలేదు" అంది సుజాత.

"ఓరి నీ ఇల్లు బంగారంగానూ! బాగా అడుగుతున్నావే!" అన్నాడు తారకం.

"నన్నెందుకూ మధ్యలో లాగి పోసుకుంటారు? నా చదువుకేం ఖర్చు చేశాడు నాన్న? నా స్కాలర్‌షిప్పులే నన్ను చదివించాయి ... మీకూ తెలివి ఉంటే మీరూ చదువుకోవలసింది! ... అప్పుడు నీకు అయిదువేలిస్తే, ఆ వడ్డీ అంతా కలిపి ఇప్పటికి ముప్పయి వేలయి ఉండేది ... నాన్న నాకు అంత ఇవ్వనే లేదు!" అంది సుగుణ కోపంగా.

"అవునమ్మా! మాకే చాలా ఇచ్చారు. మాకేం లోపం చెయ్యలేదు" అంది సుభద్ర వ్యంగ్యంగా.

"మరైతే ఎందు కా ఏడుపులూ!"

"ఏడుపేం ఉంది? మాకేం లోపంలే దంటున్నాగా ... మీలాగా జీపుల్లో రాలేకపోయినా ..." అంది సుభద్ర.

"బోర్నవిటా తాగలేకపోయినా, మాకూ పాడి ఉంది! మీరు ఎన్నడూ వాసన కూడా చూసి ఎరగని మంచి నెయ్యి మా పాలేళ్ళు కూడా తింటారు!" అంది సుజాత.

"చాలా సంతోషం! మరి నా మీద పడి ఏడవడం దేనికి? చిన్నపిల్ల అన్నారని కూడా జ్ఞానం లేకుండా, తేరగా దొరికింది కుందామని ఆస్తి, ఆస్తి అంటూ దేవిరించడం దేనికి?" తీవ్రంగా అంది సుగుణ.

"దోచుకు తిన్నవాళ్ళకి మా పాట్లు దేవులాటలాగానే ఉంటాయి. అయినా, నిన్ను కాదుగా అడుగుతున్నది! నాన్నని అడుగుతున్నాం! అదీ ఇస్తానన్నాడు కాబట్టి ... నిన్ను అడిగే పరిస్థితే వస్తే ... రాము, రాము ... అడుక్కుతింటాంగానీ, నీ గుణం తెలిసి నీ దగ్గర చెయ్యి చాస్తామా, తల్లీ!" అంది సుభద్ర.

"అందుకే చదువుకున్నదాన్ని! మాటలు నేర్చిన దాన్ని ... ఉన్నా అంటే ఉన్నా అనగలను!" అంది సుజాత.

"కుక్కబుద్ధి ఎవరికి ఉందో బాగానే తెలుస్తోంది!" అంది సుగుణ రెట్టించిన స్వరంతో.

"సుగుణా! ఏమిటది!" మందలించ బోయాడు భాస్కరం.

"ఛీ! వీళ్ళకు బుద్ధి వస్తుం దనుకోవడం తెలివి తక్కువ. బ్రాన్స్! రండి, పోదాం!" అని చివ్వున లేచి, ఛంగున గది లోకి వెళ్ళి పోయింది సుగుణ. భాస్కరం ఆమెని అనుసరించాడు.

"ఆహా! మహా దొడ్డతల్లి! ఒకళ్ళకి నీతులు చెప్పేముందు తాను నేర్చుకోవాలి! మేం అడుగుతున్న దేమిటి, తాను అంటున్న దేమిటే?" అని సుభద్ర విసుగ్గా లేచి పందిరి మంచం మీదికి వెళ్ళిపోయింది. పెద్దల్లుడు కూడా ఆఫీసరును అనుసరించే గుమాస్తాలాగా ఆమె వెంట నడిచాడు.

"గురివింద గింజ సామెతలాగా ఉంది. పెద్దా, చిన్నా లేకుండా ..." అని గొణుక్కుంటూ, నేల శుభ్రం చెయ్యటానికి ఉపక్రమించింది సుజాత.

"నిజంగా అట్లాగే ఉంది!" అన్నాడు తారకం, చుట్ట వెలిగించుకుంటూ.

• •

సాయంత్రమైంది.

వీధిలో అన్ని ఇళ్ళ ముంగిళ్ళలోనూ దీప భామినులు నాట్యం చేస్తున్నాయి. సంధ్యా కాంతుల నీడల్లో అవి మరింత ఉజ్జ్వలంగా కనిపిస్తున్నాయి.

సీతాపతి ఇంట్లో మాత్రం ఇంకా నిస్తబ్ధత తొలగలేదు. లక్ష్మమ్మ మాత్రం ఆందోళనగా అటూ ఇటూ తిరిగింది.

"సుభద్రా! లే అమ్మా! కొత్త బట్టలు కట్టుకో!... సుజాతా! లే అమ్మా! దీపారాధన చేసి, వీధిలో దీపాలు వెలిగించు. సుగుణా! లే అమ్మా ..." పేరుపేరునా పిలిచి బ్రతిమాలుకుంది. కానీ, ఎవ్వరూ గడప దాటి బయటికి రాలేదు. అసలు ఎవరి స్థానాల్లోంచి వాళ్ళు కదల లేదు.

చీకట్లు చిక్కబడుతున్నాయి. మంచం మీద కూర్చున్న తారకం లేచాడు.

"అత్తయ్యగారూ! రండి. దీపాలు వెలిగించండి. చూడండి! కూనలు ఎలా దిగాలుపడి ఉన్నారో! ... అన్ని ఇళ్ళ లోనూ హుషారు చిందులు తొక్కుతూంది. ...పిల్లు చూడండి — పాపం! ... మీరు పెద్ద ముత్తయిదువు ... మీరు వెలిగించండి దీపాన్ని ... నేను సాయం చేస్తాను!" అన్నాడు తారకం.

దీపాలన్నీ వెలిగించాక, "రండిరా, కూనల్లారా! టపాసులు కాల్చండి! అమ్మ వాళ్ళు రాకపోతే అమావాస్య ఆగిపోదులే!" అన్నాడు తారకం పద్మనీ, శేషునీ పిలుస్తూ.

పద్మా, శేషూ భయం భయంగా అతడి దగ్గరికొచ్చారు. "బావా, అక్కలు ఎందుకూ రాలేదు?" అని అడిగింది పద్మ. శేషు కూడా ప్రశ్నార్థకంగా అతడి వంక చూశాడు.

వాళ్ళ ముఖాలని చూసేసరికి అతడికి జాలి కలిగింది. ఇద్దరినీ చెరొక చేతిలోకీ తీసుకొంటూ, "ఒరే! మీరు పసికూనలురా! ... పొద్దున్న బట్టలకోసం మారాం చేస్తే, కథలు చెప్పి మిమ్మల్ని ఒప్పించాను. ... మీ అక్క లున్నారే!... వాళ్ళు ఎదిగిన కూనలు! ... ఒళ్ళు ఎదిగిందికానీ, వాళ్ళకి మీ బుద్ధు లేరా! ... రండి, రండి! ఇదుగో, ఇక్కడ చిచ్చుబుడ్డి పెట్టాను... కాకరపువ్వు వత్తి అంటించి, దాన్ని వెలిగించరా, శేషూ!... ఈ బాణా సంచా అంతా మనమే కాలుద్దాం ..." అన్నాడు తారకం.

శేషు తటపటాయించాడు. "రా! వెలిగించు!" అన్నాడు తారకం. శేషు నవ్వాడు. పద్మ కూడా అతణ్ణి చూసి నవ్వింది. ముందుకు వచ్చాడు శేషు.

చిచ్చుబుడ్డి చిరునవ్వులు లోభత్వపు క్రీనీడలని వేయి వెలుగు ఖండాలుగా చీల్చివేసినాయి. ★